నర్సరీని సందర్శించిన డీఆర్‌డీఓ పీడీ



నర్సరీ సందర్శిస్తున్న డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ నర్సరీని బుధవారం డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు సందర్శించారు. అధికారులు, సిబ్బందితో కలిసి నర్సరీలోని మొక్కలను పరిశీలించి నిర్వహణ తీరు, అందుబాటులో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీ నిర్వహణపై పలు సూచనలు చేసి చేశారు. హరితహారం మొక్కల నిర్వహణ విధిగా చేపట్టాలని, ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. నర్సరీలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వినూత్న, గ్రామ కార్యదర్శి మధు, బిల్ కలెక్టర్ మహేందర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీకి నానోటెక్నాలజీ కౌన్సిల్ గ్రాంట్



గ్రాంట్ అందుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని 'ఐఈఈఈ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, నానోటెక్నాలజీ, కౌన్సిల్ రూ.500 డాలర్ల రోబోటిక్స్ ఆటోమేషన్ సొసైటీ స్టార్టప్ గ్రాంట్ అందుకుంది. ఈ సందర్భంగా ఐఈఈఈ రోబోటిక్స్ ఆటోమేషన్, నానోటెక్నాలజీ కౌన్సిల్ స్టూడెంట్స్ చైర్ స్వాతి, వైస్ చైర్ చరణ్, సెక్రటరీ ప్రజ్వల, కోశాధికారి భవాని, వెబ్ మాస్టర్ సుస్మిత, ఫ్యాకల్టీ సలహాదారుడు సిద్ధనిజశ్ కుమార్, ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస చలపతి, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ సంతోష్ అభినందించారు.

తోటి ఉద్యోగికి ఆర్టీసీ సిబ్బంది సాయం



కండక్టర్‌కు సాయం అందజేస్తున్న మేడ్చల్ ఆర్టీసీ ఉద్యోగులు

మేడ్చల్: నిత్యం తమతో కలిసి పనిచేసిన ఉద్యోగి అనారోగ్యానికి గురికావడంతో తోటి ఉద్యోగులు స్పందించి ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మేడ్చల్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌గౌడ్ కొద్ది రోజుల క్రితం పక్షవాతం బారిన పడి చికిత్స పొందుతున్నాడు. అతడి నెలసరి జీతంపై ఆధారపడి జీవించే కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకున్న తోటి ఉద్యోగులు రూ.21వేల విలువ చేసే వంట సరుకులు, రూ.74,830 నగదు అందజేశారు.


వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవిలత

కీసర: రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం అధికారి ఎస్.మాధవిలత అన్నారు. భోగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు వరి, ఇతర పంటల సాగులో సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జిలుగ, పెసర, అలాగే పచ్చి ఆకు ఎరువులుగా గ్లైసిరియా, వెంపతి, సీతాఫలం, జిల్లేడు వాడాలని సూచించారు. వర్మి కంపోస్టు సాగులో వాడటం వలన పంట నాణ్యత పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథ రికార్డులను బుధవారం అధికారులు పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి, డీఈ మహేందర్, ఏఈ వసుధ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన ఏడు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో నీటి సరఫరా తీరును గ్రామ కార్యదర్శి రవీందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం కావడంతో నీటి వినియోగం పెరుగుతుందని, గ్రామ ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

ఉప్పల్‌లో పాలి క్లినిక్‌లు సీజ్

ఉప్పల్: ఉప్పల్‌లో పలు ప్రాంతాల్లోని పాలి క్లినిక్‌లపై తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్స్ సిఫార్సుల మేరకు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు డా.టి.రఘునాథస్వామి, కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య అధికారి, డా.ఎస్.నారాయణరావు బృందం పాలీ క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీమణికంఠ హెల్త్ కేర్ అండ్ పాలీ క్లినిక్ ఉప్పల్, చిలుకనగర్‌లోని శ్రీరాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. తనిఖీల్లో దొరికిన వైద్య పరికరాల ఆధారంగా సర్జికల్ కుట్టు సూదులు, కత్తెరలు, ఈఎన్‌టీ ప్రొసిడ్యూరల్ మెటీరియల్స్, ఎపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజక్షన్లు తదితర వస్తువులు స్వాధీనం చేసుకుని క్లినిక్‌లను సీజ్ చేశారు.

కలిసొచ్చేదెవరికి..?

మల్కాజిగిరిపై అన్ని పార్టీల ఆశలు

- రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ
- ఆ రెండు పార్టీలకు దక్కని మల్కాజ్‌గిరి
- విభిన్న తీర్పునిస్తున్న మల్కాజ్‌గిరి ఓటర్లు

ఓటర్లపరంగా దేశంలోనే అత్యంత పెద్ద నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో మూడుసార్లు ఎన్నికలు జరగ్గా బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటర్లు ఏనాడూ పట్టం కట్టలేదు. పునర్విభజనలో భాగంగా సిద్దిపేట్ పార్లమెంట్ నుంచి విడిపోయి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నగరంలోని ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్, కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి అసెంబ్లీ స్థానాలతో కలిపి 2007లో ఏర్పడింది. సగం హైదరాబాద్ నగరం మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోకి వచ్చింది. ప్రధానంగా వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి నివాసముండే నగర ప్రాంతాలు ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. ఓవైపు పారిశ్రామిక వాడలు, మరోవైపు మధ్య తరగతి నివాసయోగ్యమైన కాలనీలు, వ్యాపార సముదాయాలు ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజలు, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ఉత్తర భారతదేశానికి చెందిన ప్రజలు సమపాళ్లలో నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఓటర్ల సంఖ్య దేశంలో ఏ లోక్‌సభ నియోజకవర్గంలో లేని విధంగా 36 లక్షలకు చేరింది.

– మేడ్చల్

విభిన్న తీర్పునిస్తున్న ఓటర్లు..

లోక్‌సభ నియోజకవర్గంలో మొదటి సారి 2009లో ఎన్నికలు జరగ్గా నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణ ఎంపీగా విజయం సాధించారు. 2014లో రెండవ సారి ఎన్నికలు జరగ్గా నాటి ఎన్‌డీఏ కూటమి మిత్రపక్షమైన టీడీపీ అభ్యర్థి నేటి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంపీగా గెలుపొందారు. 2019లో ఎన్నికలు జరగ్గా నేటి సీఎం నాటి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించారు. మూడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ చేసినా, రెండు ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసినా ఆ రెండు పార్టీలకు నియోజకవర్గ ఓటర్లు పట్టం కట్టలేదు. రేవంత్‌రెడ్డి ఎంపీగా పోటీ చేసిన సమయంలో ఆ పార్టీకి నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకున్నా కాంగ్రెస్ గెలిచింది. దేశంలోని అన్ని ప్రాంతాల ఓటర్లు మల్కాజ్‌గిరి పరిధిలో ఉండటంతో ఓటర్లు ఎక్కువగా జాతీయ పార్టీల వైపు మొగ్గుచూపుతున్నారు. ఒకసారి బీజేపీ మిత్రపక్షంగా ఉన్న టీడీపీని, రెండుసార్లు కాంగ్రెస్ పార్టీని ఆదరించారు.

బీఆర్‌ఎస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలు..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా ఏడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు సైతం గెలవని కాంగ్రెస్, బీజేపీలు మల్కాజ్‌గిరి ఎంపీ కోసం గంపెడాశలు పెట్టుకున్నాయి. బీజేపీ నుంచి అగ్ర నాయకుడు ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి ఉమ్మడి జిల్లా నాయకురాలు సునీతమహేందర్‌రెడ్డి వంటి హేమాహేమీలను రంగంలోకి దించగా బీఆర్‌ఎస్ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలస వెళ్లిన లక్ష్మారెడ్డిని ఎన్నికల బరిలో దించింది. లక్ష్మారెడ్డి మినహా ఈటల రాజేందర్, సునీత మహేందర్‌రెడ్డిలు నియోజకవర్గంలో విడిది కోసం వలస వచ్చినవారే..




ఈసారి ఓటర్లు ఎటువైపో..?

ప్రతి ఎన్నికల్లో జాతీయ పార్టీలకు, జాతీయ పార్టీల మిత్ర పక్షాలకు పట్టం కడుతున్న మల్కాజ్‌గిరి ఓటర్లు ఈ సారి ఎన్నికల్లో ఎటువైపు మొగ్గు చూపుతారో అంతుచిక్కడం లేదు. గతంలో కంటే రాష్ట్రంలో రాజకీయాలు భిన్నంగా ఉండటంతో మల్కాజ్‌గిరి రాజకీయం రాష్ట్రానికి ఆసక్తిగా మారింది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు సంపూర్ణంగా ఎమ్మెల్యేల బలం, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో అధికారం బలం, బీజేపీకి దేశంలో అధికార బలం.. ఇలా ఎవరి బలాలు వారికి సరిపడా ఉన్నా ఓటర్లు ఎటువైపు ఉన్నారో అంతుచిక్కడం లేదు.

జోరుగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు..

నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిలు నియోజకవర్గంలో ఏదో ఒకచోట పర్యటనలు చేస్తూ ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. కాలనీలు, కుల సంఘాలు, పార్టీ సమావేశాలు, చేరికలు ఇలా అన్ని అస్త్రాలు ప్రయోగిస్తూ రాజకీయాన్ని మరింత వేడెక్కిస్తున్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మిగతా వారికంటే కాస్త వెనుకంజలో ఉంది. కాంగ్రెస్ క్యాడర్ సిట్టింగ్ ఎంపీ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నీ తానై నడిపిస్తున్నారు.



అందరికంటే సీఎంకే ప్రతిష్ఠాత్మకం..

సిట్టింగ్ ఎంపీగా ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం ప్రతిష్ఠాత్మకంగా మారింది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సీటును ఎట్టి పరిస్థితిలో కోల్పోవద్దనే ఉద్దేశ్యంతో ఆయన మంత్రి తుమ్మలను ఇన్‌చార్జిగా నియమించారు. స్థానిక, రాష్ట్రస్థాయి నాయకులు ఎందరో మల్కాజ్‌గిరి టికెట్ ఆశించినా అందరినీ కాదని, అన్ని హంగులు ఉన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి భార్య, నాలుగు పర్యాయాలుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా ఉన్న సునీతను అనూహ్యంగా రంగంలోకి దించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం మొత్తం ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో ఉండటం 30 ఏళ్లు ఉమ్మడి రంగారెడ్డిలో క్రియాశీలక నాయకుడిగా ఉన్న మహేందర్‌రెడ్డి కుటుంబాన్ని ఎంపీ బరిలో దించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సక్సెస్ అయ్యారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మొత్తం మీద మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మకంగా మారింది.

ఈటలకు చావోరేవో..

బీఆర్‌ఎస్ పుట్టినప్పటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగి ఆ తర్వాత ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరి హుజూరాబాద్ ఉప ఎన్నికలో గెలిచి తన సత్తా చాటిన ఈటల రాజేందర్‌కు ఈ ఎన్నికలు చావోరేవోగా మారాయి. ఈటలే బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి అని గత అసెంబ్లీ ఎన్నికల్లో జోరుగా ప్రచారం సాగింది. అసెంబ్లీ ఎన్నికల వరకు ఈటల హవా బాగానే ఉంది. అనూహ్యంగా ఆయన గజ్వేల్‌లో, హుజూరాబాద్ రెండు స్థానాల్లో ఓటమి చెందడంతో ఆయన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. మల్కాజ్‌గిరి టికెట్ సాధించిన ఆయన ఈ ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పాలని రాజకీయం నడిపిస్తున్నారు. ఫలితం వ్యతిరేఖంగా వస్తే రాజకీయ భవిష్యత్ దెబ్బతింటుందనే భావనలో ఉన్న ఆయన గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ క్రమంలోనే తన వద్ద ఉన్న సీనియార్టీ, కులం, ధనం, ఉద్యమం, సానుభూతి, బీసీ కార్డు, పాత పరిచయాలు ఇలా ప్రతి అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. మొత్తం మీద మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి ఎవరు లోకసభకు వెళ్తారో గానీ ఇక్కడి నేతల భవిష్యత్‌ను డిసైడ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టోల్ ఫ్రీ నంబర్ 18004252050

ఎన్నికలపై ఫిర్యాదు చేయవచ్చు: కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ కలెక్టరేట్లో 24 గంటలు పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కు ఫోన్ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు డబ్బుల తరలింపులు, ఇతర ప్రలోభాలకు గురిచేసినట్లు ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోండి

కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన లక్ష్మణ్



జవహర్‌నగర్‌లో ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్న మేయర్ శాంతి కోటేష్‌గౌడ్



నగరపాలక సంస్థ పేరుతో చలివేంద్రాలను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

జవహర్‌నగర్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా జవహర్‌నగర్‌లోని మేయర్, డిప్యూటీ మేయర్లు మాత్రం అవేవీ పట్టించుకోవడంలేదు. నూతనంగా ఎన్నికైన మేయర్ శాంతికోటేష్‌గౌడ్ ఏకంగా ద్వాక్రా భవనంలో ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ల డబ్బులు పంపిణీ చేస్తూ ప్రచారం మొదలుపెట్టారు. అనంతరం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లపు రవితో పాటు పలువురు నాయకులతో కలిసి జవహర్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో జవహర్‌నగర్ నగర పాలక సంస్థ పేరుతో చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ విషయంపై స్థానిక తెలుగు యువత అధ్యక్షుడు లక్ష్మణ్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎన్నికల కోడ్ ఉల్లంగించిన మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.



మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న లక్ష్మణ్

దమ్మాయిగూడలో ఉద్రిక్తత

జవహర్‌నగర్: కిరాణ డబ్బుల కోసం వెళ్లిన ఓ యువకుడిపై కత్తిపోట్లతో దాడికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని సాయిరాంనగర్‌లో రామ్‌లాల్(21) కిరాణ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. అదేకాలనీలో నివసించే ముజమిల్ అహ్మద్(31) బీటెక్ పూర్తి చేసి కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. రామ్‌లాల్ కిరాణ దుకాణం నుంచి నిత్యం అహ్మద్ కుటుంబ సభ్యులు కిరాణ సరుకులు తీసుకుంటారు. ఈ క్రమంలో ఇరువురు ఒకరిఒకరు డబ్బులు ఇచ్చి పుచ్చుకుంటున్నారు. కిరాణ దుకాణం సరుకులకు సంబంధించిన రూ.2 వేలు ఇవ్వాలని రామ్‌లాల్, అహ్మద్ తల్లికి ఫోన్ చేయగా ఇంటికి వచ్చి తీసుకుపొమ్మని చెప్పింది. దీంతో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు డబ్బులు అడిగే క్రమంలో రామ్‌లాల్, అహ్మద్‌ల మధ్య గొడవ జరిగింది. దీంతో అక్కడే ఉన్న కత్తిని తీసుకుని అహ్మద్, రామ్‌లాల్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు రామ్‌లాల్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దాడికి నిరసనగా స్థానికులు, బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దమ్మాయిగూడలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న వారితో కుషాయిగూడ ఏసీపీ మహేష్, సీఐ నాగరాజు మాట్లాడారు. బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి, గాలి సంపత్‌యాదవ్‌తో మాట్లాడి సముదాయించారు.



చికిత్స పొందుతున్న రామ్‌లాల్



దమ్మాయిగూడలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు, బీజేపీ నాయకులు

ఈటల గెలుపు ఖాయం

మౌలాలి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల గెలుపు ఖాయమని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. మౌలాలి పీబీ కాలనీలో ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీజేపీతోనే మల్కాజ్‌గిరి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, మల్లారెడ్డి, శ్రీను యాదవ్, శివ, వెంకటేష్,లింగరావు, కిరణ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ డివిజన్, మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషఅభినవ్ పర్యటించారు. గతంలో పూర్తయిన పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు జీహెచ్ఎంసీ తిరిగి చెల్లించాల్సిన ఈఎండీ నిధుల మంజూరు కోసం ఆమె పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఏఈ రవళి, ఏఈ లక్ష్మీ, అల్వాల్ సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మల్కాజ్‌గిరి పార్లమెంట్ గులాబీదే..

కాప్రా: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం బీఆర్‌ఎస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి కలిశారు. తెలంగాణ భవన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను వివరించారు. మల్కాజ్‌గిరిలో బీఆర్‌ఎస్‌కు అనుకూల పరిస్థితులే ఉన్నాయని, ఈసారి మల్కాజ్‌గిరి పార్లమెంట్ గులాబీదేని వారు ధీమా వ్యక్తం చేశారు.

రాజగోపుర ప్రతిష్ఠాపనోత్సవం

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ రాజగోపుర ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య రాజగోపుర హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థాపిత దేవత పూజ, మూల మంత్ర అనుష్ఠానములు ప్రసాద హోమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. గురువారం ఉదయం 11.59 నిమిషాలకు శ్రీ మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా రాజగోపుర ప్రతిష్ఠ యంత్ర ప్రాణ ప్రతిష్ఠ స్వామివారి అనుగ్రహ భాషణం ఉంటాయన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ డివిజన్, మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషఅభినవ్ పర్యటించారు. గతంలో పూర్తయిన పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు జీహెచ్ఎంసీ తిరిగి చెల్లించాల్సిన ఈఎండీ నిధుల మంజూరు కోసం ఆమె పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఏఈ రవళి, ఏఈ లక్ష్మీ, అల్వాల్ సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

దారి కోసం రైతుల ధర్నా



కీసరగుట్ట అటవీ ప్రాంతం నుంచి దారి వదిలి పెట్టాలని ధర్నా చేస్తున్న రైతులు

కీసర: ఏళ్ల తరబడి నూరమ్మ చెరువు కింద ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లే రహదారిని ఫారెస్టు అధికారులు మూసేస్తున్నారని బుధవారం కీసరకు చెందిన పలువురు రైతన్నలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు పెద్దులు, సాయికుమార్ తదితరులు మాట్లాడుతూ తమ తాతలు, తండ్రుల కాలం నుంచి నూరుమహ్మద్ చెరువు కింద ఉన్న పట్టా భూముల్లో వ్యవసాయం చేసేందుకు రైతులు కీసరగుట్ట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న అటవీ భూమి మీదుగా రాకపోకలు సాగిస్తున్నామని, ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లకుండా అటవీభూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం తాము అటవీశాఖ అధికారులను కలిసి తమగోడు వెళ్లదీసుకుంటే రహదారిని వదిలి పెడతామని తెలిపారన్నారు. బుధవారం నుంచి తిరిగి అటవీశాఖ అధికారులు తమ రహదారిని కూడా మూసేసి కంచె ఏర్పాటు పనులు చేపడుతున్నారని, అధికారులను అడిగితే ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోమని సలహాలు ఇస్తున్నారన్నారు. పనులు మాత్రం ఆపేది లేదని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారని, తమకు ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ ధర్నాలు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. రైతులకు బీఆర్‌ఎస్ నేత నాయకపు వెంకటేష్ మద్దతు తెలిపారు.

మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి

కీసర: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమన్నారు. దేశ ప్రజలంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని, ఇందుకోసం బీజేపీ నేతలు ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి విస్తృతంగా బీజేపీ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గోధుమకుంట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు.



గోధుమకుంటలో బీజేపీలో చేరిన నేతలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి

వారికి పటోళ్ల విక్రంరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు వంగేటి బాపిరెడ్డి, కోల బాల్‌రాజ్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌ముదిరాజ్, బోడ శ్రీనివాస్‌రావు, చినింగని సుధాకర్, సంతోష్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రావు, రాము, భరత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సురేందర్‌రెడ్డి, నందు, సుశాంత్, ఆంజనేయులు, నర్సింహాచారి, నాగరాజు, బండారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో పాలకవర్గం, రైతులు

శామీర్‌పేట్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా మండల వ్యవసాయదారుల సేవా సహకార సంఘం పనిచేస్తుందని చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట్‌లోని సంఘం కార్యాలయంలో 41వ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అన్ని వసతులు కల్పించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మూడేళ్ల తమ పాలకవర్గం హయాంలో సంఘం లాభాల్లో నిలిచిందని, గోదాములు, అగ్రి అవుట్‌లెట్లు నిర్మించుకున్నామని, రైతుల సౌకర్యార్థం అలియాబాద్, మూడుచింతలపల్లిలో ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేశామని తెలిపారు. టీఎస్‌సీఏబీ పైలట్ ప్రాజెక్టు కింద సంఘాన్ని ఎంపిక చేశారని, రైతుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.